ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కడప అర్బన్ : ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పూర్తి అయిన కుటుంబాలలోని నిరుద్యోగ యువతకు డిడియుజికేవై పథకం ద్వారా సీడప్ సౌజన్యంతో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కో-ఆర్డినేటర్ ఎన్. సుబ్బ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉన్నతి స్కీంలో భాగంగా కంప్యూటర్ హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్ కోర్సులలో నాలుగు నెలలు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణతో పాటు అదనంగా బేసిక్ కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పించనున్నట్లు తెలిపారు. ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వంతో గుర్తించబడిన సర్టిఫికెట్, అర్హతను బట్టి ప్రయివేట్ సంస్థలో మంచి జీతంతో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు అడ్మిషన్ల కోసం జిల్లా కోర్టు ఎదురుగా నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్‌లో లేదా, సెల్ 9063082227లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అసైన్డ్ భూముల చట్ట సవరణ

ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

దళిత, గిరిజన, పేదలకు నష్టం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అసైన్డ్ భూముల చట్ట సవరణ ఆర్డినెన్స్ రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు శివకుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ పోరాట సాధన కమిటీ జిల్లా అధ్యక్షులు బి.నారాయణ, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు బండి జకరయ్య, బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జీ గుర్రప్ప, సిహెచ్ఆర్‌డి శివారెడ్డి, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాదరావు, ముస్లిం మైనార్టీ నాయకులు దస్తగిరి, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు దేవ శ్రీకృష్ణ, గిరిజన టీచర్చ్‌ర్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మునెయ్య, ఎస్‌సి, ఎస్‌టి హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు జె.వి.రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దళితులు భూములను పెత్తదార్లకు దారతత్తం చేసేందకు ఆసైన్డ్ భూముల చట్ట సవరణ ఆర్డినెన్స్ తీసుకువచ్చారని విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద దళుతుల భూములను కారుచౌకగా అగ్రవర్ణాల వారు కాజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గరిష్ట భూ పరిమితి చట్టం అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూములు కొనుగోలు చేయకూడదు, అమ్మకూడదని చట్టంలో ఉన్నా అగ్రవర్ణాలవరూ భయపెట్టి, బెదిరించి స్వాధీనం చేసుకుంటున్నారని చెప్పారు. సావిశెట్టిపల్లె, అక్కెంగుడ్ల ప్రాంతంలో వేలాది ఎకరాలు బడా నాయకులచేతిలో ఉన్నాయని తెలిపారు. పేదలకు భూములు ఇమ్మంటే లేవని చెప్పే ప్రభుత్వం, తహశీల్దార్లు పెద్దలకు మాత్రం వందల ఎకరాలు కట్టబెడుతూ పాసుపుస్తకాలు కూడా ఇస్తున్నారని విమర్శించారు. అగ్రవర్ణాల చేతిలో ఉన్న దళి,పేద, బడుగు,బలహీన వర్గాల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తిరిగి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు దగ్గరుండి బడా నాయకులకు వేల ఎకరాలు భూములు కేటాయిస్తున్నారని విమర్శించారు. నవరత్నాల పేరుతో దళితలకు వచ్చే 35 నుంచి 40 పథకాలు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ ఐక్యంగా ఏర్పడి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడాలని, చట్ట సవరణ ఆర్డినెన్స్ రద్దు చేసే వరకు కమిటీగా ఏర్పడి ఉద్యమించాలని నిర్ణయించామన్నారు. అప్పుడే పేదలకు భూమి దక్కుతుందని తెలిపారు. పేదల భూములను పెద్దలకు కట్టబెట్టేందుకు కొంత మంది తహశీల్దార్లు, విఆర్‌ఒలు తహతహలాడుతున్నారని పేర్కొన్నారు. భూమి అగ్రవర్ణాల అనుభవంలో ఉంటే వారికి ఆన్‌లైన్ చేసి పాసుపుస్తకాలు ఇస్తున్నారని తెలిపారు. పేదలు అడిగితే సెంటు భూమికూడా లేదంటున్నారని విమర్శించారు. మూడుపులు ఇచ్చేవారికే ప్రభుత్వ భూములు దక్కుతున్నాయని చెప్పారు. పేదలకు మొండి చేయి చూపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు పాపిరెడ్డి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, అంజి, వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బి. నారాయణ

ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- తండ్రి కర్మకాండకు వెళ్లి వస్తూ.. ఘోరం
- క్షత్రగాత్రులను ఆస్పత్రికి తరలింపు
- మృతులు తెలంగాణ వాసులు

ప్రజాశక్తి-చెన్నూరు

మండంలోని కడప-కర్నూలు జాతీయ రహదారి గోసుల కల్యాణ మండపం సమీపంలో ఆంధ్రస్పైస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. తండ్రి కర్మకాండకు వెళ్లి వస్తూ మృత్యువాత పడ్డారు. మృతులంతా తెలంగాణా వాసులు. క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సమాచారం మేరకు వివరాలు..

తెలంగాణ రాష్ట్రంలోని ఖైరతాబాద్‌కు చెందిన కొండేటి కృష్ణ తండ్రి ఇటీవల తిరుపతిలో మృతిచెందారు. ఆయన కర్మకాండల కోసం కృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి బయలు దేరారు. కార్యక్రమం పూర్తి చేసుకుని ఆదివారం ఖైరతాబాద్‌కు కారులో తిరుగుపయనమయ్యారు. మండలంలోని కడప-కర్నూలు జాతీయ రహదారి ఆంధ్రస్పైస్ వద్దకు రాగానే చెట్టుకింద నిలబడి ఉన్న తమిళనాడకు చెందిన ఉప్పులోడు లారీని వెనుకభాగం నుంచి కారు వేగంగా ఢీకొంది. ఆ సమయంలో లారీ డ్రైవర్ వంట చేసుకుంటు ఉండగా కారు లారీ కిందకు పూర్తిగా దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కొండేటి కృష్ణ (48), అతని అత్త పద్మావతి (60), కుమారుడు రిషి (15) ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. కాగా మృతుడి భార్య విజయవాణి, కుమార్తె నిహారిక తీవ్రంగా గాయ పడ్డారు. సమాచారం తెలియగానే ఎస్ఐ శ్రీనివా సులురెడ్డి తమ సిబ్బందితో హుటాహుటీనా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ కింద ఇరుక్కున కారును వెలికి తీశారు. గాయపడిన క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతుడి కుమారుడు పదవ తరగతి చదువుతున్నాడు. కుమార్తె ఎంసెట్ లాంగ్‌టర్మ్ (మెడిసిన్) కోచింగ్ తీసుకుంటున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో ప్రమాద సంఘటన స్థలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మృతులు : కృష్ణ, పద్మావతి (ఫైల్‌ఫొటో)

గాయపడిన వారు : నిహారిక, విజయవాణి

కారులో ఇరుక్కుపోయిన మృతదేహం

లారీకింద ఇరుక్కున్న కారును వెలికి తీస్తున్న స్థానికులు, పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని బపనపల్లెకు వెళ్లే దారిలో అదుపుతప్పి ద్విచక్ర వాహనం కింద పడిపోవడంతో దూదేకుల సలీం బాషా(41) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సలీంబాషా పులివెందులలోని సంతోష్ హోటల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంలో బపనపల్లిలో ప్రోగ్రాం ఒప్పుకునేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా దారి మధ్యలో వాహనం అదుపుతప్పింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

'గురుకులం' సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-బి. కోడూరు

మండలంలోని సగిలేరు గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరి ష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కారదర్శి రవి పేర్కొన్నారు. ఆదివారం వారు పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 350 మంది విద్యార్థులుంటే వారికి సరైన సదుపాయలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని తెలిపారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. గదుల్లో ఫ్యాన్లు, లైట్లు లేవని, దీంతో దోమల మోతతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాచ్‌మెన్ ఉన్నా వారికి సరైన భద్రత లేదని వాపోయారు. తాగేందుకు నీళ్లకూడా లేదన్నారు. రోజూ మెయిన్‌రోడ్డుపై ఉన్న బోరు వద్దకు వెళ్లి తమ అవసరాలు తీర్చు కుంటున్నారని చెప్పారు. సమస్యలపై పలుమార్లు ప్రిన్సిపల్ నిరంజన్‌ను ప్రశ్నిస్తే తనకు సంబంధం లేనట్లుగా సమాధానం ఇస్తున్నారని చెప్పారు. ఇప్ప టికైనా ఉన్నతాధికారులు సమస్యలను పరిష్కరించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు రాహుల్, విష్ణు, వంశీ, రిషి, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వివేకానంద సేవాశ్రమంలో 'మానవత' దినోత్సవం

పోరుమామిళ్ల టౌన్ : ప్రపంచ మానవతా దినోత్సవాన్ని వివేకానంద సేవాశ్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. నరేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సమానత్వం పాటిస్తూ సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని ప్రజలలో పెంపొందించాలని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ సగిలి ప్రకాష్ రావు మాట్లాడుతూ అందరూ సోదర భావంతో సర్వమాన సమానత్వం పాటిస్తూ మానవ సేవ చేయాలని పేర్కొన్నారు. వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ సేవ చేస్తున్న రామకృష్ణారెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆశ్రమానికి రూ.10 వేలు విరాళం అందజేశారు.

అరసం అఖిల భారత మహాసభల్లో కడప ప్రతినిధులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్‌లో అభ్యుదయ రచయితల సంఘం అఖిలభారత మహాసభలకు అరసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష వర్గసభ్యులు ఆచార్య నల్లప రెడ్డి ఈశ్వర రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, వైయస్సార్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సిద్ధ మూర్తి రాజగోపాల్ రెడ్డి, అరసం రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు, పెనుగొండ లక్ష్మీనారాయణ, వల్లూరి శివప్రసాద్ హాజరయ్యారు. రచయితలు అందరూ కలసి అరసం పతాక ఆవిష్కరణ చేశారు. ప్రజాస్వామ్య పరిక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యంగా బోధించే నినాదాలు చేశారు. తర్వాత జబల్పూర్ లోని మానస ఆడిటోరియంలో ఆరంభమైన సభలో జాతీయ కార్యవర్గ సభ్యులు రచయితలు అనుసరించాల్సిన విధానాలపై ఉపన్యసించారు. సాయంత్రం జరిగిన ఊరేగింపులో జెండాలు పట్టుకుని కదం తొక్కారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలపై తక్షణమే చర్యలు తీసుకొని నరహంతకులను కఠినంగా శిక్షించాలని, బాధితులను ఆదుకోవాలని నినదించారు.

మహాసభల్లో పాల్గొన్న కడప ప్రతినిధులు

యువతికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

రంగసముద్రం పంచాయితీ సుందరయ్య కాలనీలో చిట్టిబోయిన లక్ష్మి దేవి అనే యువతి రుమటాయిడ్ అర్థరైట్స్ అనే వ్యాధితో బాధపడుతుంది. ఆమె వైద్యం కోసం మండలంలోని మార్కాపురానికి చెందిన పారిశ్రామికవేత్త గొంగల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి తన బెంగళూరు వైసిపి వింగ్ (శ్యామ్ కలకడ అన్న టిమ్) టిమ్ సభ్యులతో కలసి ఆదివారం రూ.80 వేలు ఆర్థికసాయం చేశారు, అలాగే పిడుగుపల్లికి చెందిన ఏ. నాగేంద్ర తన తోటి డిగ్రీ స్నేహితులతో కలిసి రూ. 30 వేలు అందించారు.

ఆరోగ్యశ్రీ సేవలతోనే స్వస్థత సాధ్యం

- కార్డులు లేని వారికీ సేవలు అందిస్తాం
- ఆరోగ్య ఆసరాతో సర్జరీ రోగులకు ఆర్థిక సాయం
- ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.బాలాంజనేయులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఆరోగ్యశ్రీ సేవలతోనే రోగులకు స్వస్థత సాధ్యం. ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల దగ్గర నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురైతే ఆరోగ్య శ్రీ కో- ఆర్డినేటర్, 104 కాల్‌సెంటర్, హెల్ప్‌డెస్క్, ఆరోగ్య మిత్రలను సంప్రదిస్తే పరిష్కారం లభిస్తుంది. రేషన్‌కార్డులు లేకపోవడం, కార్డు ల్లో పేర్లు నమోదు చేయకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొనే రోగులకు సిఎంసి లెటర్ ద్వారా ఆరోగ్యశ్రీ సేవలకు అర్హత కల్పిస్తాం. రాష్ట్రప్రభుత్వం ఆరోగ్యశ్రీ విభాగంలోనికి మరిన్ని అదనపు వ్యాధులను చేర్చిన విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని పేర్కొంటున్న ఆరోగ్యశ్రీ ఉమ్మడి జిల్లాల కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.బాలాంజనేయులుతో ప్రజాశక్తి ముఖాముఖి...

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఎన్ని?

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో 43 హాస్పిటల్స్ ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఆధ్వర్యంలో 12 హాస్పిటల్స్ ఉన్నాయి. ఇందులో మూడు హాస్పిటల్స్‌కు ఇటీవలే అనుమతి లభించింది. ఈలెక్కన 52 హెల్ప్‌డెస్క్‌ల్లో ఆరోగ్యమిత్రలు సేవలు అందిస్తున్నారు.

నెట్‌వర్క్ ఆస్పత్రులు వివరాలు చెప్పండి?

కడప నగరంలో 17, ప్రొద్దుటూరులో 10, జమ్మలమడుగులో 03, పులివెందుల్లో 05, కమలాపురంలో 01, మైదుకూరులో 02, బద్వేల్‌లో 02, రాజంపేటలో 02, రైల్వేకోడూరులో 01, రాయచోటిలో 02 హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి.

ఆరోగ్యశ్రీ ఆపరేషన్ల సంఖ్య ఎంత?

2019 నుంచి 2023 ఆగష్టు నాటికి 2,51,093 మందికి ఆరోగ్యశ్రీ పథకం కింద పలువురు రోగులకు సేవలు అందించడ మైంది. రోజుకు 40 నుంచి 50 ఆపరేషన్ల లెక్కన నెలకు 1500 నుంచి 2000 ఆపరేషన్లు చేయిస్తున్నాం. ఈమేరకు రూ.538.33 కోట్లను చెల్లించడమైంది.

అత్యధిక సర్జరీ కేసులేమిటి?

రాష్ట్రప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద 3,255 వ్యాధులకు చికిత్సలు అందిస్తోంది. ఉమ్మడి కడప జిల్లావ్యాప్తంగా అత్యధికంగా ఆర్థోపె డిక్, గైనకాలజీ, కార్డియాలజీ, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా చికిత్సలు చేయించుకుంటున్నారనేది ఓ అంచనా.

ముఖా ముఖి..

కార్డులు లేని, పేర్లు గల్లంతైన రోగుల పరిస్థితేమిటి?

ఒషన్‌కార్డులు లేని, పేర్లు గల్లంతైన పేద రోగులకు ఆరోగ్య శ్రీ పథకం వర్తించే ప్రయత్నం చేస్తున్నాం. ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స తీసుకోవాలనుకుంటున్న రోగులకు సిఎంసి లెటర్‌ను అంది ంచి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫారసు చేస్తాం.

'ఆసరా' పథకం అమలు ఎలా ఉంది?

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోని సర్జరీ రోగులు కోలుకునే సమ యాన్ని లెక్కించి రోజుకు రూ. 225 చొప్పున రూ.ఐదు వేల ను 24 గంటల్లోపు సర్జరీ రోగుల ఖాతాల్లో వేయడం జరుగుతోంది. దీని ఆసరాతో రోగుల కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గడంతోపాటు త్వరగా కోలుకునే అవకాశం ఉంది.

'ఆసరా' లబ్ధిదారుల సంఖ్య, వెచ్చించిన వ్యయమెంత?

ఆరోగ్యశ్రీ ఆసరా కింద 1519 వ్యాధులు ఎంపిక చేయడ మైంది.ఇందులో 1,8,667 మంది లబ్ధిదారులకు రూ.67.06 కోట్లు ఖర్చు చేశాం.

ఆరోగ్యశ్రీ రోగులు ఫిర్యాదు చేయాలనుకుంటే ఎలా?

ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగా అందని పక్షంలో రోగులు హెల్ప్ డెస్క్, ఆరోగ్యమిత్ర, 104 కాల్‌సెంటర్లను ఆశ్రయించే సదుపాయం కల్పించాం.

మూఢ నమ్మకాల నిర్మూలనకు 'దభోల్కర్' నిరంతర కృషి

వర్ధంతి సభలో హేతువాద సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అశోక్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

మతోన్మాదుల చేత హత్య చేయబడ్డ ప్రజా వైద్యుడు, మహారాష్ట్ర మూఢనమ్మకాల నిర్మూలన చట్టం కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి డాక్టర్ నరేంద్ర దభోల్కర్ అని ఎపి హేదువాద సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్. అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం పాత బస్టాండ్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో డభోల్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ నరేంద్ర దభోల్కర్ వర్ధంతిని జాతీయ వైజ్ఞానికదకృథం దినోత్సవంగా సైన్స్, హేతువాద, మానవవాద సంస్థలు దేశమంతటా నిర్వహిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూఢనమ్మకాలను పెంచి పోషించే విధంగా ఉన్నాయని, నిర్మూలన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశంలో మూఢనమ్మకాలు, హింస పెరిగి పోతున్నయని అన్నారు. వీటిని ఎదుర్కోవాలంటే సైన్స్ ప్రచారం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. అసత్య ప్రచారాల ద్వారా ప్రజలను హింస వైపు ప్రేరేపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో జరిగే హింస, అత్యాచారాలను ఆ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెంటనే అరికట్టి శాంతిని పునరుద్ధరించాలని కోరారు. శాస్త్ర విజ్ఞాన పరిశోధనలు, ప్రయోగాల నిధులు కేటాయింపులకు కోత పెట్టిందని చెప్పారు. పదవ తరగతి పాఠ్యపుస్తకంపై ముద్రించిన రాజ్యాంగ పీఠిక పై గతంలో ఉన్న సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలను కూడా ఏకపక్షంగా తొలగించిందని తెలిపారు. కార్యక్రమంలో హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి. ప్రసాద్ రావు, నాయకులు శివారెడ్డి, ప్రజాతంత్ర అభ్యుదయవాదులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

'వజ్రాలవాన' కురిపిస్తున్న

ఉత్తమ కథకుడు చదువుల బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

నాలుగు దశాబ్దాలుగా పిల్లల కథలు రాస్తూ బాలసాహిత్యంలో వజ్రాలవాన కురిపిస్తున్న ఉత్తమ కథకుడు డి.కె.చదువుల బాబు అని ప్రముఖ కథారచయిత డాక్టర్ ఎం.హరికిషన్ కొనియాడారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 123వ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో 'డి.కె.చదువులబాబు జీవితం 'సాహిత్యం' అనే అంశంపై కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ ప్రసంగించారు. డి.కె.చదువులబాబు కుటుంబీకులు మూడు తరాలుగా చదువులు చెప్పేవారు కావడంవల్ల ఆయనను చదువులబాబుగా పిలిచేవారని చెప్పారు. ఆయన అసలు పేరు ఖాసీం బాబు అన్నారు. ప్రస్తుతం ఆయన కమలాపురం మండలం పెద్దచెప్పలి గ్రామంలో తెలుగు భాషోపాధ్యాయుడుగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారన్నారు. మహారాష్ట్రలోని 3, 5, 6 తరగతుల తెలుగు విద్యార్థులకు చదువులబాబు రాసిన 'కనువిప్పు, పిల్లలూ జాగ్రత్త, అవకాశం' అనేరచనలు పాఠ్యాంశాలుగా ఉన్నాయని, వీరి రచనలు ఆంగ్ల, కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయన్నారు. డి.కె.చదువులబాబు మాట్లాడుతూ తనపై నెల నెలా సీమ సాహిత్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన విశ్వవిద్యాలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. కార్యక్రమంలో వక్త డాక్టర్ ఎం.హరికిషన్‌ను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు జి.హరిభూషన్, ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, గానుగపెంట హనుమంతరావు, అలపర్తి పిచ్చయ్య చౌదరి, కొత్తపల్లె రామాంజనేయులు, డా.తవ్వా వెంకటయ్య, భూపతి రాయల్, ముడియం కిషోర్, రాజారెడ్డి సత్కరించారు.

రాష్ట్ర స్థాయి శిక్షణకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్

చెవి శస్త్రచికిత్సపై జూనియర్ ఇఎన్‌టి వైద్యులకు నిర్వహించిన శిక్షణా సదస్సుకు విశేష స్పందన లభించిందని విజయ ఇఎన్‌టి చైల్డ్ కేర్ ఆసుపత్రి ఎండి డాక్టర్ వి.హరికిషన్ అన్నారు. ఆదివారం విజయ ఇఎన్‌టి ఆసుపత్రిలో హ్యాండ్స్ ఆన్ టెంపోరర్ బోన్ రాష్ట్ర స్థాయి శిక్షణ సదస్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ఇఎన్‌టి వైద్యులు హాజరయ్యారని, వీరిలో అత్యధికంగా మహిళా వైద్యులు ఉన్నారని తెలిపారు. గత ఏడాది కూడా రాష్ట్ర స్థాయి శిక్షణ ఇచ్చామని చెప్పారు. స్థానికంగా ఉన్న ఇఎన్‌టి వైద్యుల సహకారంతో శిక్షణను విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. సహకరించిన వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. చెవి ఎముక ద్వారా ఎలా శస్త్రచికిత్స చేయాలో తెలియజేశామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు శస్త్రచికిత్సలు విజయవంతంగా చేయగలరనే ఆశాభావం వ్యక్తం చేశారు. అన్నిరకాల సదుపాయాలతో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్, డాక్టర్ అమరనాథ్, డాక్టర్ పురుషోత్తం, ఐఎంఎ అధ్యక్షులు, సీనియర్ ఇఎన్‌టి వైద్యులు డాక్టర్ ఫరూక్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ శేషశయనారెడ్డి, డాక్టర్ ప్రతాప్‌కుమార్, డాక్టర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారితో డాక్టర్ హరికిషన్, ఇఎన్‌టి వైద్యులు

సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - దువ్వూరు

గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని నారాయణపల్లి గ్రామంలో ఆదివారం పోలీసులు నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు ఐకమత్యంగా ఉండాలన్నారు. గొడవలకు తావివ్వరాదన్నారు. చట్ట వ్యతిరేక పనులు చేయరాదన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వాముల్లో సోదాలు చేస్తున్న పోలీసులు

ఖాజీపేట : ప్రజలు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి ఘర్షణల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుంపలుగట్టు గ్రామంలో ఆదివాకం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు మైదుకూరు డిఎస్పి వంశీధర్ గౌడ్, రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఫ్యాక్షన్, రౌడీ షీటర్ల నివాసాల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సత్ప్రవర్తనతో ప్రజలందరూ మెలగాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి

ప్రజాశక్తి - దువ్వూరు

నాగులచవితి సందర్భంగా ఆదివారం మండలంలోని గ్రామాల్లో మహిళలు ఒక్కపొద్దులు పాటించారు. తెల్లవారు జామునే పుట్టకు పాలుపోసి నియమ నిష్టలతో ఒక్క పొద్దు గడిపారు. దువ్వూరు బంగ్లా ఆవరణలో ఉన్న పుట్టకు, పాత దువ్వూరులో వెలసిన ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న నాగుల కట్టకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దువ్వూరు : నాగులకట్టకు పూజలు చేస్తున్న మహిళలు

సింహాద్రిపురం : మండలంలో ఆదివారం ఘనంగా నాగుల చవితి వేడుకలను జరుపుకున్నారు. ఉదయమే మహిళలు పెద్ద ఎత్తున పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యువకులు పలు పందేలు కాశారు. సరదాగా గడిపారు.

లింగాల : అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు నిర్వహించే నాగులచవితి సందడి ఆదివారం మండలంలో కనిపించలేదు. గతంలో పులివెందుల ప్రాంతంలో నాగులచవితి పండుగ అంటే ఎంతో ఘనంగా నిర్వహించేవారు. పండుగ 20 రోజులు ముందే ప్రతి ఇంట్లో పలు రకాల పిండి వంటలు తయారు చేసు కునేవారు. వచ్చిన చుట్టాలతో గ్రామాలన్నీ కళకళలాడేవి. ప్రస్తుతం ఆ సంబ రాలు గ్రామీణ ప్రాంతాల్లో కనిపించడం లేదు. ఇంట్లో పిండి వంటలు ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది యాచకులు వచ్చి అడిగి తీసుకునేవారు. ప్రస్తుతం ఆ పిండి వంటలు తయారు చేసే వారు లేరు. ఆ పిండి వంటలు కోసం వచ్చే యాచకులూ కనిపించడం లేదు. ఏదో పండుగ చేస్తున్నామంటే చేస్తున్నాం అనే రీతిలో జరుపుకున్నారు. గతంలో నాగుల చవితి పండగ వస్తోం దంటే ముందు నుంచి యువకులు టెంకాయ విసరడం, వొట్టి కొబ్బరి గిన్నెలు ఒకదానిపై ఒకటి పేర్చి పగలగొట్టడం వంటి సరదా పందేలు వేసుకునేవారు. ఈ ఏడాది ఎలాంటి సరదా పందేలు మండలంలో కనిపించడంలేదు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

పార్టీలకతీతంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని నేలటూరు పంచాయతీలో ఆదివారం నూతన సచివాలయాన్ని ఎమ్మెల్యే, మైదుకూరు వైసిపి సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ చంద్ర బాబుకు పిచ్చి పరాకాష్టకు చేరిం దన్నారు. 2019 ఎన్నికల్లో మైదుకూరు మండలం గంగాయపల్లె గ్రామంలో తనకు కేవలం రెండు ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. సంక్షేమ పథకాల ద్వారా గంగాయపల్లె గ్రామానికి రూ.19 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గంగయ్యపల్లెలోని 50 కుటుంబాలవారు వైసిపిలో చేరారన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి రామగోవిందరెడ్డి, ఎంపీపి వీరనారాయణరెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డ్ మెంబర్ శంకర్‌రెడ్డి, సోమిరెడ్డి పల్లి సింగిల్‌విండో చైర్మన్ సుబ్బారెడ్డి, ఎంపిడిఒ వెంగమునిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - ఖాజీపేట

క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఖాజీపేటలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆర్.సి.యం చర్చి నుండి అంబేద్కర్ సర్కిల్, మన్నా చర్చి వరకు ర్యాలీ సాగింది. మణిపూర్‌లో చోటు చేసుకున్న మారణకాండ ఘటనను నిరసించారు. రాష్ట్ర మాల మహానాడు వైస్ ప్రెసిడెంట్ గున్నంపాటి వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఇటాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు, దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవ సంఘం ప్రతినిధులు

అహంకారానికి వార్డు ఎన్నికల ఫలితాలే నిదర్శనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అహంకారానికి వార్డు ఎన్నికల ఫలితాలే నిదర్శనమని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిబి రోడ్డులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పంచాయతీ వార్డు ఎన్నికల్లో అహంకారానికి ప్రజల తిరుగుబాటుకు అభినందనలు తెలిపారు. రాజుపాలెం గ్రామంలో జరిగిన వార్డు ఎన్నికల్లో టిడిపి గెలవడం ఆనందదాయకమన్నారు. ప్రొద్దుటూరులో టిడిపిని గెలవనివ్వనని, ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే రాచమల్లు ఇప్పుడు ఏం మాట్లాడుతారో చెప్పాలన్నారు. ప్రత్యర్థులు వెయ్యి ఇస్తే తాను వెయ్యి ఇస్తానని, రూ.2000 ఇస్తే తానూ రూ.2000 ఇస్తానని చెప్పిన ఎమ్మెల్యే, డబ్బు ఎక్కువ ఇచ్చి గెలిచాననే అపకీర్తి తనకు వద్దని చెప్పి కొత్తపల్లె పంచాయతీలో బంగారు గొలుసు, వెండి పట్టీలు, రూ.5000 డబ్బు, పట్టుచీర, స్టూలు వార్డు ప్రజలకు తాయిలాలు ఇచ్చింది ఎవరో చెప్పాలన్నారు. ఒక వార్డు గెలవడానికి దాదాపు రూ.3 కోట్లు ఖర్చు చేశారని, ఇది ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. 2024 శాసనసభ ఎన్నికల్లో బంగారు కమ్మలు, ఏసీలు, వేల డబ్బు ఇచ్చినా కూడా ప్రజలు ఇదే తీర్పును ఇచ్చి టిడిపికి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తారని ప్రవీణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ జేబీఉల్లా, బీసీ నాయకుడు తాటి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

యథేచ్ఛగా అనుమతిలేని నర్సరీలు

ప్రజాశక్తి - చాపాడు

నియోజకవర్గ పరిధిలో అనుమతుల్లేని నర్సరీలు రోజురోజుకూ విపరీతంగా పెరుగుతున్నాయి. మైదుకూరు, చాపాడు, దువ్వూరు, బి.మఠం, ఖాజీపేట మండల పరిధిలో కుందూ, బ్రహ్మసాగర్ బోరుబావులు, చెరువుల కింద కూరగాయల సాగుకు రైతులు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు ప్రభుత్వ అనుమతి లేకుండా నర్సరీలు ఏర్పాటు చేసి కూరగాయల మొక్కలను రైతులకు అమ్మకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో వారు ఇష్టానుసారంగా విత్తనాలను సేకరించి సరైన ప్రమాణాలు పాటించకుండా నర్సరీ పెంపకం చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. సరైన దిగుబడులు రాక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. నర్సరీ ఏర్పాటు చేసే సమయంలో అనుమతి తీసుకుంటే నాణ్యమైన విత్తనాలు సాగు చేసి మేలురకం మొక్కలను రైతులకు ఇవ్వడమే కాకుండా రసీదులు తప్పక ఇస్తారు. నర్సరీలకు అనుమతులు లేకపోవడంతో రైతులకు రసీదులు ఇవ్వడంలేదు. పంటలు దిగుబడి సరిగా రాకపోయినప్పటికీ రైతులు నర్సరీ యజమానులను ప్రశ్నించలేని పరిస్థితుల్లో ఉన్నారు. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. జిల్లాలోని నియోజకవర్గాలు, ఇతర జిల్లాల రైతులు కూడా మైదుకూరు నర్సరీల నుండి మొక్కలు సేకరించుకొని తీసుకు వెళుతున్నారు. ముఖ్యంగా మిరప, టమోటా, చిక్కుడు,అనప, బీర వంటి కూరగాయల రకాలను సాగు చేస్తూ రైతులు నష్టాల బారిన పడుతున్నారు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా సుమారుగా 180 నర్సరీలు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారుల వద్ద కేవలం 8 మందికి మాత్రమే అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమంగా వందలాది నర్సరీలు ఏర్పడి కూరగాయలు సాగు చేసే రైతులను నట్టేట ముంచుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి అనుమతుల్లేని నర్సరీలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

జివి సత్రం వద్ద అందుబాటులో ఉన్న కూరగాయల నర్సరీ

ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు పంపిణీ

నిత్యావసర వస్తువులు అందిస్తున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రూరల్ పరిధి నంగనూరుపల్లే వెళ్లేదారిలో ఉన్న మదర్ థెరిస్సా వృద్ధాశ్రమానికి ఆర్‌కె హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ సహకారంతో మీ కోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రూ.20వేలు విలువచేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మన ప్రజాసేవ సమితి అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్ మాట్లాడుతూ ఆర్‌కె హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారు తమ జీవనోపాధి కోసం, కువైట్ వంటి దేశాలకు వెళ్లారన్నారు. వారి సంపాదనలో కొంత మొత్తాన్ని తమ మాతృభూమికి ఏదైనా చేయాలనే ఉద్దేశ్యంతో సభ్యులందరూ ప్రతినెలా తమ కొంత సొమ్ము పోగుచేసుకుని నిరాశ్రయులకు, అభాగ్యులను ఆదుకుంటున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కొన్ని ఆశ్రమాలకు ప్రతి నెలా కొంత మొత్తంలో నిత్యావసర వస్తువులు, ఆశ్రమానికి కావాల్సిన ఇతర ఏదైనా వస్తువులు తీసుకోవడం కోసం సహాయం చేస్తున్నారని వివరించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు వారు మరెన్నో చేయాలని ఆయన ఆకాంక్షించారు. సగర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీధర్, సామాజిక సేవకులు వేములపాటి సూర్యనారాయణరెడ్డి, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు పుల్లగూర విష్ణువర్ధన్, అమ్మ సేవా సమితి శివశంకర్, మన ప్రజా సేవా సమితి గౌరవ అధ్యక్షులు హాజీబాషా. మస్తాన్‌వలి, వృద్ధాశ్రమ నిర్వాహకులు కంచన రాజేష్ పాల్గొన్నారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - చాపాడు

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వ సలహాదారులు నాగార్జున్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలోని రామచంద్ర మిషన్ ధ్యాన కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో కూడుకున్న పనుల నుంచి ధ్యానంతో ప్రశాంతత పొందవచ్చున్నారు. మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకునే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపేట ధ్యాన మందిరం నిర్వాహకులు డి.సురేంద్రనాథ్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు సాంబశివారెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ధ్యాన మందిరం వద్ద మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

దోమల నియంత్రణ అందరి బాధ్యత

మాట్లాడుతున్న డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దోమల నియంత్రణ అందరి బాధ్యత అని డాక్టర్ హిమబిందు తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆమె మాట్లాడుతూ దోమల వృద్ధిని అరికట్టాలన్నారు. ఆడ ఎనాఫిలిస్ దోమ వల్ల మలేరియా వ్యాధి వ్యాపిస్తుందనే విషయాన్ని సర్ రోనాల్డ్‌రాస్ 1897 ఆగస్టు 20న కనుగొన్నారని తెలిపారు. దోమకాటువల్ల మలేరియా, డెంగీ వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. మలేరియా ఒకరి నుండి ఒకరికి సోకుతుందన్నారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో సిఒ సుబ్బారెడ్డి, ఆశాలు పాల్గొనారు.

అక్టోబర్ 29న ప్రొద్దుటూరులో పరుగు పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు హాఫ్ మారథాన్-2023లో భాగంగా అక్టోబర్ 29న ప్రొద్దుటూరులో ఐరన్ మ్యాన్ ఐక్యత పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐరన్ మ్యాన్ ఉండేల రామనాథరెడ్డి ఐఆర్ఎస్ తెలిపారు. స్థానిక రాయల్ కౌంటీ రిసార్ట్స్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని పెద్ద నగరాల్లో జరిగిన విధంగానే మార్థాన్ పరుగుల పోటీలు తాను పుట్టి పెరిగిన ప్రొద్దుటూరులో నిర్వహించాలన్నదే తన లక్ష్యమన్నారు. ఈ పోటీల వల్ల పోటీ తత్వం పెంచి, ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఐరన్ మ్యాన్ ఉండేలా రామనాథరెడ్డి ఆధ్వర్యంలో సేవామ్స్ ట్రస్టు ద్వారా 2022లో విశేష స్పందనతో ప్రొద్దుటూరు ఆఫ్ మార్థాన్ విజయవంతమైన నేపథ్యంలో 2023లో రెండవ ప్రొద్దుటూరు హాఫ్ మార్థాన్ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. పాల్గొనే క్రీడాకారులకు టీ-షర్ట్, నిర్దేశించిన దూరం పూర్తి చేసిన వారందరికీ ఫినిషర్ మెడల్, ప్రశంసాపత్రం, అల్పాహారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్‌లో అక్టోబర్ 15లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మూడు రకాలుగా పరుగు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని తనతోపాటు ఎస్బిఐ గోపికృష్ణ హైస్కూల్, ఎస్ఆర్ఐటి వంటి సంస్థల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ వై అహ్మద్‌బాషా, ఉపాధ్యాయులు ఆర్ ప్రభుకుమార్, మాజీ ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ ప్రసాద్‌రెడ్డి, ఐరన్ మ్యాన్ కార్యక్రమ కన్వీనర్ మురళి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కెవి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉండేల రామనాథరెడ్డి

డ్రాయింగ్, క్రాఫ్ట్ టీచర్స్‌ను క్రమబద్ధీకరించాలి

విజయలక్ష్మికి వినతి పత్రమిస్తున్న డ్రాయింగ్ అండ్ క్రాఫ్ట్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

రాష్ట్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్న డ్రాయింగ్, క్రాఫ్ట్ టీచర్స్‌ను క్రమబద్ధీకరించాలని ఎపి రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగింజలు విజయలక్ష్మికి వినతి పత్రం అందించినట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చౌడం బాబు తెలిపారు. పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో విజయలక్ష్మి, చంద్రమౌళికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లాలని కోరామన్నారు. అనంతరం బడిగింజల విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ 2009లో కాంట్రాక్టు ఉద్యోగులు అందరికీ జిఒ 31 ఇచ్చి డ్రాయింగ్ అండ్ క్రాఫ్ట్ టీచర్లను క్రమబద్ధీకరించారని గుర్తు చేశారు. డ్రాయింగ్ అండ్ క్రాఫ్ట్ టీచర్స్ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తప్పక తీసుకు వెళతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెంకటేష్, వెంకటేశ్వర్లు, నరసింహులు, రామచంద్రుడు, నాగలక్ష్మి , కొండారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

యువత సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అర్బన్ సిఐ రాజు తెలిపారు. పులివెందులకు చెందిన వైసిపి విద్యార్థి విభాగం నాయకులు బీటెక్ పోరెడ్డి జశ్వంత్‌రెడ్డి (నాని) జన్మదిన వేడుకలు ఆదివారం ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విభిన్నప్రతిభావంతుల నెట్వర్క్ అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ రాజు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం నాని సమకూర్చిన వాటర్ క్యాన్లను 20 మంది విభిన్నప్రతిభావంతులకు సిఐ అందజేశారు. రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ నాని ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో మరిన్ని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, వైసిపి యూత్ నాయకులు యోహాన్, మహి, అనిల్, బషీర్, సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

వాటర్ క్యాన్ అందిస్తున్న సిఐ, నాని

ప్లకార్డు పట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ కార్యాలయం ఎదుట ఆదివారం డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్ ప్లకార్డు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి గత తన పాదయాత్రలో అన్ని రంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తామని, డిఎస్‌సి విడుదల చేస్తానని చెప్పి ఇప్పటివరకు ఎలాంటి పోస్టులు భర్తీ చేయలేదన్నారు. ఉన్నత చదువులతో ఉద్యోగాల్లేక వలస వెళుతున్నారన్నారు. మరికొందరు కూలి పనులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను అర్థం చేసుకొని అన్ని రంగాల్లో ఉన్న ఖాళీల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. నిరసన కార్యక్రమంలో సురేష్, లక్ష్మీ, తేజ, ప్రసన్న పాల్గొన్నారు.

లింగాల ఎస్ఐగా రవికుమార్

ప్రజాశక్తి - లింగాల

లింగాల ఎస్ఐగా రవికుమార్ ఆది వారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రుషికేశ్వర్‌రెడ్డి కడప సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ రవికుమార్‌ను బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ వచ్చే ప్రతి బాధితునికి న్యాయం జరిగేలా చేస్తామన్నారు. మండల పరిధిలోని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తమ దృష్టికి తేవాలన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ

పోలీసుల అదుపులో నిందితుడు?

ఈనెల 5న పార్నపల్లి గ్రామం కోన మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద వాచ్‌మెన్ ఈశ్వరయ్య దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. అక్కడే పనిచేస్తున్న వంట మనిషి రామాంజనేయులు ఈశ్వరయ్య తలపై రోకలిబండతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుని కోసం లింగాల పోలీసులు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పెండింగ్ నిధులు విడుదల

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక కడప-పులివెందుల, వేంపల్లె-గండి రోడ్డు విస్తరణలో బాధితులకు పెండింగ్‌లో ఉన్న రూ.14 కోట్ల నిధులను విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందని జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నిధులను మంజూరు చేసేందుకు సిఎం జగన్ దృష్టికి ఎంపీ అవినాష్‌రెడ్డి, కలెక్టర్, పాడా ఓఎస్‌డి కృషి చేశారన్నారు. మండలంలోని గిడ్డంగివారిపల్లె రిజర్వాయర్ కింద ముంపునకు గురయ్యే భూములకు సంబంధించి రైతులకు నష్ట పరిహారం కింద రూ.8 కోట్లు, అలవలపాడు లిఫ్ట్ ఇరిగేషన్ కింద ముంపునకు గురయ్యే భూములకు సంబంధించి పరిహారం కింద రైతులకు రూ.2 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలో జమ అయిందని జడ్పీటీసీ పేర్కొన్నారు. రోడ్ల విస్తరణ సంబంధించి పూర్తిగా నిధులు మంజూరు కావడంతో అధికారులు పనులను త్వరితగతిన పూర్తి చేస్తారని చెప్పారు. రోడ్ల విస్తరణకు చెందిన పరిహారం అందిన బాధితులు తమ గృహాలను తొలగించాలని ఆయన కోరారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి సంద ర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ అయిదేళ్ల ప్రధానిగా, ఆరేళ్ల ఇటు దేశానికి అటు కాంగ్రెస్ పార్టీకి రాజీవ్ గాంధీ ఎనలేని సేవలు చేసినట్లు చెప్పారు. ఎక్కువ మంది యువతకు ప్రజాస్వామ్యం ప్రక్రియలో భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళ సాధికారతకు కృషి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, బద్రి, రాఘవయ్య, శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

ప్రొదుటూరు : దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తన జీవితాన్ని దేశానికి అంకితం చేశారని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ కొనియాడారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం పార్టీ కార్యాలయంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జీలానిబాషా, సైమన్, రవి, భాస్కర్, ఫిరోజ్ పాల్గొనారు.

నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాజీ సైనికోద్యోగులకు సన్మానం

పులివెందుల రూరల్ : ఆర్మీ విశ్రాంత సైనికోద్యోగులను ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైస్ మనోహర్‌రెడ్డి సత్క రించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ జాతీ య పర్వదినాల్లో సైని కుల త్యాగాలను స్మరించు కోవాలన్నారు. ముం దుగా మున్సిపల్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన 'నా భూ మి-నా దేశం' శిలా ఫలకాన్ని ప్రారంభించారు. హాజరైన విభిన్న ప్రతిభా వంతుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, భరత మాత ముద్దుబిడ్డలైన సైనికుల త్యాగాలను కొనియాడారు. అనంతరం సైనిక ఉద్యోగులు మాట్లాడుతూ తమను గుర్తించి సన్మానించిన ప్రభుత్వానికి, మున్సి పల్ కమిషనర్ నరసింహారెడ్డి, వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, దాసరి చంద్ర మౌళి, ఖాదర్, జగదీష్, లక్ష్మీప్రసన్న, భార్గవి, సుజాత, షాహిదా, రాజేశ్వరి, మాజీ సైనిక ఉద్యోగులు సి.ఆదినారాయణరెడ్డి, ఎమ్మెస్ సుబ్ర హ్మణ్యం, కె.గంగిరెడ్డి, వై శివశంకర్‌రెడ్డి, ఆర్.రంగేశ్వరరెడ్డి, పివి మహేశ్వర్‌రెడ్డి, ఎం.హర్షవర్ధనరెడ్డి, పి.గంగిరెడ్డి, ఆర్ .సుధాకర్ రెడ్డి, యు ప్రసాద్, పి.గంగాధర్ రాయల్ ఉన్నారు.

మాజీ సైనికుల ఉద్యోగులను సన్మానిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

పంచాయతీ ఎన్నికల్లో వైసిపి ప్రభంజనం

పులివెందుల టౌన్ : పంచాయతీ ఉప ఎన్నికల్లో వైసిపి ప్రభంజనం సృష్టించిందని మున్సిపాలిటీ చైర్మన్ వరప్రసాద్, ఎపి పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్ తెలిపారు. వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో ఆదివారం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఆయన అందిస్తున్న పాలనపై ప్రజలకు ఎనలేని విశ్వాసం, నమ్మకం ఉందని ఈ పంచాయతీ ఎన్నికలు నిరూపించాయన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా వైసిపి విజయఢంకా మోగిస్తూ ఉంటుందని తెలిపారు. ఎవరెన్ని పాదయాత్రలు, వారాహి యాత్రలు చేసినా, చంద్రబాబు ఎన్ని కుయుక్తులతో ప్రజలను మభ్య పెట్టాలని చూసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మరోసారి స్పష్టంగా నిరూపితమైందన్నారు.

అనాథ మృతదేహానికి 'మానవత' అంత్యక్రియలు

వేంపల్లె : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన జయలక్ష్మి అనే అనాథ మృతదేహానికి ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెను మూడు రోజుల క్రితం సంస్థ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. అయినా ఆమె మృతి చెందింది. సంస్థ చైర్మన్ చక్రపాణి రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు బాలాజీ ఆధ్వర్యంలో సభ్యులు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహిం చారు. కార్య క్రమంలో మానవత డైరెక్టర్ పుల్లగూర గోవర్ధన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌ॥ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No. 533/2020

బోగా బాల వీరయ్య,S/o బాలయ్య, వయస్సు 52 సం॥ హిందూ,గోల్డ్‌స్మిత్, డి.నెం.4/468,సూపర్ బజార్ రోడ్డు, ప్రొద్దటూరు టౌన్,కడపజిల్లా, **...వాది**

VS

యల్లపు నాగరాజు,S/oమునిరాజు చనిపోయినందున వారసులు
1.యల్లపు లక్ష్మి,W/o యల్లపు నాగరాజు,వయస్సు 25 సం॥
2.యల్లపు సాత్విక్ S/o యల్లపు నాగరాజు, వయస్సు 9 సం॥
3.యల్లపు రిషికౌశిక్,S/o యల్లపు నాగరాజు,వయస్సు 7 సం॥
అందురు కలిసి డి.నెం.28/173-1,రామేశ్వరము, ప్రొద్దటూరు టౌన్,కడప జిల్లా ... **ప్రతివాదులు**

దావా సమను

పై తెలిపిన వాది ప్రతివాదులు అయిన 1,2 మరియు 3 అయిన మీ పైన పై కోర్టు లో దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలలో మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల మీరు కానీ మీ వకీలు గాని **14-09-2023** వ తేదీ ఉదయం **10-30** గంటలకు పై కోర్టుకు హాజరై ఆక్షేపలు తెలుపుకొనవలెను. లేనంతట మీకు పరోక్షముగా తీర్మానించబడును అని ఇందు మూలముగా తెలయజేయడమైనది.

By order of the Court

జి.శ్రీ రామ చంద్ర ప్రసాద్
వాది తరపున అడ్వకేట్, ప్రొద్దుటూరు